

27న పారా రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 27న 4 వ రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు విజయవాడ వేదికగా నిర్వహిస్తున్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ జోనల్ పారా షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల ఎంపికల కోసం ఈ పోటీలను విజయవాడ తాడిగడపలో గల ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షుటింగ్ స్పోర్ట్స్, ఎల్. వి. గార్డెన్స్ లో నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల వికలాంగ పారా షూటర్స్ ఈ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9849377577, 9390131777 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

దళారుల బారిన మొక్కజొన్న రైతులు

- కొనుగోలు చేయని ప్రభుత్వం
- పెట్టుబడులూ రావడం లేదని రైతుల ఆవేదన

ప్రజాశక్తి-బొబ్బిలి

మొక్కజొన్న రైతులు దళారుల బారిన పడుతున్నారు. మొక్కజొన్నకు మంచి గిరాకీ ఉండడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పశువులు, కోళ్ల దాణాకు ఎక్కువగా వినియోగించడంతో భలే డిమాండ్ ఉంది. ఈనేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా మెట్టు, వర్షాధారంగా సాగు చేస్తున్న పల్లం భూములలో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. వారం రోజుల క్రితం నుంచి కోత దశకు రావడంతో రైతులు మొక్కజొన్న కోసేసి నూర్పిడి చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షాలు కురవడంతో నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు కల్లంలోనే పంటను వ్యాపారాలు, రైతులకు అమ్మేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న దళారులు, వ్యాపారాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి నిలువునా రైతులను దోపిడీ చేస్తున్నారు.

మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు చేయని ప్రభుత్వం

మొక్కజొన్నకు ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ. 2,400 ప్రకటించింది. అయినప్పటికీ కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈనేపథ్యంలోనే దళారులు, వ్యాపారులు క్వింటలు మొక్కజొన్న రూ. 1900 నుంచి రూ. 2వేలు వరకు కొనుగోలు చేసి నిలువునా దోపిడీ చేస్తున్నారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.మొక్కజొన్న కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



రహదారిపై ఆరబెట్టిన మొక్కజొన్న

నిల్వ చేసేందుకు అవకాశం లేక అమ్మేస్తున్నాం



మొక్కజొన్న నిల్వ చేసేందుకు అవకాశం లేక పోవడంతో వ్యాపారు లకు అమ్మేస్తున్నాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ. 2400 ప్రకటించిన కొనుగోలు చేయక పోవడంతో రైతులకు ఏమి లాభం. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదు.

ఎం.అప్పలనాయుడు, ఎం. బూర్జవలస

ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి



మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి. ఎరువులు, కూలి రేట్లు పెరగడంతో పెట్టుబడులు బాగా పెరిగి పోయాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలి.

సింగనపల్లి వేణు, గున్నతోటవలస



పోలీసు అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత, ఎస్‌పి ఎఆర్ దామోదర్

పోలీసు అమరుల త్యాగం మరువలేనిది

- కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి
- దేశ అంతర్గత భద్రతే లక్ష్యం : ఎస్‌పి
- ఘనంగా పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరుల త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోగల 'స్మృతి వనం'లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రామసుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎం.బబిత, ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అథిదులుగా హాజరై, అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ ఏడాది అమరులైన 191 మంది పోలీసుల వివరాలతో కూడిన పుస్తకాన్ని ఎస్‌పి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతి స్థాపన, నేర నియంత్రణలో పోలీసు శాఖ పోషిస్తున్న పాత్ర అత్యంత ముఖ్యమని ఆయన తెలిపారు. ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ దేశ అంతర్గత భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో పలువురు పోలీసులు తమ ప్రాణాలను తృణప్రాయంగా విడిచారని అన్నారు. దేశ అంతర్గత భద్రత కోసం, మావోయిస్టుల తీవ్రవాద కార్యక్రమాలను అరికట్టేందుకు వారితో పోరాటం చేసి, ఎంతో మంది పోలీసులు ప్రాణాలను అర్పించారన్నారు. ఆయా పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. అనంతరం, అమరుల స్థూపం వద్ద కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, ఎస్‌పితో పాటు ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి మీనాదేవి, పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి, కోరుకొండ సైనిక్ స్కూలు ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శర్మ, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ప్రజా ప్రతినిధులు పాలవలస యశస్వి, అదనపు ఎస్‌పి సౌమ్యలత, ఎఆర్ ఎఎస్‌పి జి. నాగేశ్వరరావు, పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎన్. గోపాలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పరేడ్ నిర్వహించగా, పోలీసుల తుపాకుల విన్యాసంతో అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. పోలీసుల కుటుంబాల యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి కలెక్టరు ఆఫీసు జంక్షన్ వరకు జిల్లా ఎస్‌పి ఆధ్వర్యాన పోలీసు అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి మీనాదేవి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి, సైనిక స్కూలు ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, రాఘవులు, ఎం.వీరకుమార్, కోటిరెడ్డి, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, పోలీసు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - వంగర



పిహెచ్‌సిని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

సీజనల్ వ్యాధులపై సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి జీవనరాణి వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్య అధికారి సుస్మిత దయానా, సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన వసతి గృహంలో బాలికలు మృతి చెందిన నేపథ్యంలో మన జిల్లాలో ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టారని ప్రశ్నించగా జిల్లా అంతటా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి జాగ్రత్తలు పాటించాలని తగు సూచనలు ఇస్తున్నామన్నారు. జిల్లాలో అలాంటి సమస్య ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, ప్రేమ్‌కుమార్, సిహెచ్‌ఒ నారాయణరావు, ఫార్మాసిస్ట్ సురేష్, ల్యాబ్ టెక్నీషియన్ దమయంతి సిబ్బంది పాల్గొన్నారు.

విఒఎపై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి



విచారణ చేపడుతున్న వెలుగు సిబ్బంది

మండలంలోని అంబాడ డిఆర్‌డిఎ వెలుగు విఒఎ వానపల్లి నిర్మలపై డిఆర్‌డిఎ వెలుగు పీడీ శ్రీనివాసపాణి ఆదేశాల మేరకు ఎపిఎం బాసిన గోవిందరావు, ఎస్ఎన్ మేనేజర్ పోస్టుల సుధాకర్, సిసి సవర వెంకటరమణ, ఎల్‌సి మంగళవారం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. గ్రామంలో 47 మహిళా సమైక్య సంఘాలలో 150 మంది సభ్యుల ఇంటింటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈనెల 19న విఒఎ నిధులు స్వాహా అనే కథనం ప్రజాశక్తిలో ప్రచురించడంతో అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. బ్యాంకు ఇచ్చిన రుణాలు, తిరిగి కట్టిన రుణాలుపై ఆరా తీశారు. బ్యాంకు స్టేట్మెంట్ ప్రాప్తికి మహిళా సంఘాలు వద్ద ఉన్న పుస్తకాలకు నిధులు సరిపోయాయా లేదా అని విచారించారు. లావాదేవీలలో ఏటువంటి తేడాలు లేవని విచారణ అధికారులు చెప్పారు. అయితే నిర్మల విఒఎ, బ్యాంకు మిత్రగా పనిచేస్తుందని విచారణలో తేలిందన్నారు. ఒకే వ్యక్తి రెండు ఉద్యోగాలు చేయడానికి రూల్స్ ఒప్పుకోవని ప్రభుత్వ నిబంధనల మేరకే పని చేయాలని విచారణ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో రెండో పోస్ట్ వదిలివేయాలని నిర్మలాకు ఆదేశించారు. ఈ సందర్భంగా విచారణ అధికారులు మాట్లాడుతూ మండలంలో 48 మంది విఒఎలు పనిచేస్తున్నారని, వీరులో ఎవరైనా రెండు పోస్టులు చేస్తే ఒకటి వదిలేయాలని చెప్పారు. ఈ విచారణకు స్థానిక సర్పంచ్ చుక్కా వెంకట నాయుడు, ఫిర్యాదుదారులు జమ్మన రాంబాబు, గౌరీశ్వరి గైర్హాజరయ్యారు.

ట్రంప్ దిష్టి బొమ్మలు దహనం

భారత్‌పై పెంచిన సుంకాలను తగ్గించాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి -గంట్యాడ

మన దేశ ఎగుమతులపై అమెరికా పెంచిన సుంకాలను వ్యతిరేకిస్తూ ట్రంప్ దిష్టిబొమ్మ లను దీపావళి సందర్భంగా పలు చోట్ల ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన దహనం చేశారు. గంట్యాడ మండలంలోని బుడతనాపల్లి గ్రామంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయం వద్ద ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ అమెరికా ట్రంప్ టారిఫ్ టెర్రరిజం భారతదేశంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీని వల్ల దేశంలో పరిశ్రమల్లో ఉద్యోగుల కోత, ఉత్పత్తులను తగ్గించు కోవడం వంటి పరిస్థితులు వస్తాయన్నారు. భారత్‌లోకి వస్తున్న అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలను తగ్గించాలని ఒత్తిడి చేస్తున్న ట్రంప్‌కి భారత ప్రభుత్వం లొంగవద్దని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం రొయ్యలు, పత్తి, పాడి పౌల్ట్రీ, చిన్న పరిశ్రమలు, జీడిపప్పు తదితర రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంద న్నారు. అమెరికా సుంకాల వల్ల పాడి రైతు రోజుకు రూ.158, సంవత్సరానికి రూ.57వేలు నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో బుడతనాపల్లి పాల రైతుల సంఘం అధ్యక్షులు సుక్క అప్పారావు, శ్రీను, మహేష్, మణి, మంగళ కృష్ణ, అప్పల నాయుడు, లింగరావు, శేఖర్, ఉమా, అప్పల నారాయణ పాల్గొన్నారు.

కొత్తవలస : స్థానిక గాంధీనగర్, నిమ్మలపాలెం గ్రామాల్లో దీపావళి సందర్భంగా ట్రంప్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అమెరికా అధ్యక్షుడు డ్రోనాల్డ్ ట్రంప్ భారత్‌పై విపరీతమైన సుంకాలను పెంచాడని. వాటిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ ట్రంప్ వ్యవసాయ ఉత్పత్తులపై పెంచిన సుంకాలను తగ్గించాలన్నారు. కార్యక్రమం లో రైతులు కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు ఎం.శ్రీనివాసరావు, పివి రమణ, గాడి సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస : ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యర్తలు

తెర్లాం : అమెరికాతో చేసుకున్న వ్యవసాయ ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం సతివాడ గ్రామంలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయి మన వ్యవసాయాన్ని దెబ్బతీసే ఒప్పందాలను చేయడం దుర్మార్గమని సిపిఎం మండల నాయకులు సింగిరెడ్డి గోపాల్, పెంకి రామారావు, పళ్ళ ధనుంజయరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకర్రావు అన్నారు. మన దేశం నుండి అమెరికాకు ఎగుమతి అయ్యే సరుకులపై 100 శాతం సుంకాలు వేస్తామని ట్రంప్ బెదిరిస్తున్నాడని, ఆ దేశం నుంచి వస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు జీరో సుంకాలతో మన దేశం సంతకం పెట్టడం ఈ దేశ రైతాంగాన్ని నిలువునా ముంచేయడమేనని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పాలని దుర్మార్గమైన ఆలోచనలతో వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. రైతుకు నష్టం చేస్తున్న ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున రైతాంగం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గంట్యాడ : బుడతనాపల్లిలో ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- గెడ్డల్లోని ఇసుక స్థానిక అవసరాలకు మాత్రమే
- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాల్లోని చిన్నచిన్న నదులు, గెడ్డల్లో అనుమతి పొందిన థర్డ్ ఆర్డర్ రీచ్‌ల్లో దొరుకుతున్న ఇసుక ఆయా గ్రామాల అవసరాలకు మాత్రమేనని, ఇతర ప్రాంతాలకు రవాణా చేయడానికి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. వారికి ఇస్తున్న కూపన్లపై తప్పనిసరిగా తేదీ, పంచాయతీ కార్యదర్శి సంతకం ఉండాలని ఆదేశించారు. ఇలాంటి రీచ్‌ల్లో ఎక్కడా ఇసుక తవ్వకానికి మిషన్లు వాడకూడదని, వాడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక లభ్యత, డిమాండ్‌పై సమీక్షించారు. థర్డ్ ఆర్డర్ రీచ్‌లు 48 ఉన్నాయని, రెండు స్టాకు పాయింట్ల ద్వారా నాణ్యమైన ఇసుకను శ్రీకాకుళం జిల్లానుంచి తెప్పించి అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ వివరించారు. జిల్లాలో ఏడాదికి సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని, ఆ మేరకు అందుబాటులో ఉంచుతున్నామని గనులశాఖ డిడి సిహెచ్ సూర్యచంద్రరావు తెలిపారు. కొత్తవలసవద్ద ఇసుక స్టాక్ పాయింట్ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో మైన్స్ డిడి సూర్యచంద్రరావు, డిటిసి మణికుమార్, ఆర్‌డిఒలు డి.కీర్తి, రామ్మోహన్, ఆశయ్య, డిపిఒ మల్లికార్జునరావు, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, పొల్యూషన్ ఇఇ సరిత, పలువురు తాహశీల్దారులు పాల్గొన్నారు.

అర్జున అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ప్రతి ఏటా ప్రకటించే అవార్డులు (అర్జున అవార్డ్, అర్జున , మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, ద్రోణాచార్య అవార్డులు) ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారు www.dbtyas-sports.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఈనెల 28లోగా వివరాలు తెలపాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9491767327ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చునని తెలిపారు.

బాలల హక్కులకు సంక్షేమ పరిరక్షణ కమిటీలు

కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్ర ప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్, జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తమ ఛాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం అమలులో భాగంగా రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ, సమీక్ష, జిల్లా, గ్రామస్థాయి శిశు సంక్షేమ మరియు పరిరక్షణ కమిటీల ఏర్పాటు చేయాలన్న నిబంధనల మేరకు బాలల హక్కుల పరిరక్షణ కోసం బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి మాట్లాడుతూ ఈ కమిటీలు ప్రధానంగా బాలల సంక్షేమం కోసం మిషన్ వాత్సల్య ద్వారా అమలు జరుగుతున్న పథకాలు అమలు పర్యవేక్షించడం, పిల్లల సంరక్షణ, పునరావాసం, మరియు శిశు హక్కులను పరిరక్షించడం. పాఠశాల మానేసిన పిల్లలు, వీధి బాలలు, అనాథల గుర్తింపు, పునరావాసం, మహిళా, శిశుహక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుబాల్య వివాహాల నివారణకు నిర్దిష్టమైన కార్యక్రమాలు చేపట్టి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాయని తెలిపారు. చైల్డ్ రైట్స్ ఫోరమ్ కన్వీనర్ పి.చిట్టిబాబు మాట్లాడుతూ జిల్లాను బాలల స్నేహపూర్వకమైన జిల్లాగా రూపొందించి, బాల కార్మికుల బాల్యవివాహాల, బాలల లైంగిక వేధింపుల నిరోధానికి అడ్డుకట్ట వేయడానికి, బాలల కమ్యూనిటీ భాగస్వామ్యంతో ఏర్పడిన కమిటీలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు, కౌన్సిలర్ సంధ్య, లీగల్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేట్స్ జిల్లా ప్రతినిధి బైరెడ్డి శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాదర్బార్ : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్లో ఆదేశించారు. ఎఎంసిలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కళాసీలు కోరారు. తాగునీరు, రోడ్లు, కాలువ సమస్యలపై వినతులు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్రమబద్ధీకరణకు ప్రణాళిక అమలు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



నగర క్రమబద్ధీకరణ చర్యలను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ప్రణాళిక అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో అసిస్టెంట్ సిటీప్లానర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణకు మరిన్ని చర్యలు చేపట్టనున్నామని చెప్పారు. కోర్టు కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

పుర మిత్ర యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి


నగర ప్రజలకు పురపాలక సేవలను మరింత సులభతరంగా చేయడానికి ప్రభుత్వం తెచ్చిన పురమిత్ర యాప్‌ను సద్వినియోగం ఏసుకోవాలని కమిషనర్ నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ నివాస ధ్రువీకరణ పత్రాలు వంటి దాదాపు 122 పురసేవలను పొందవచ్చునని అన్నారు. సమస్యలను ఫిర్యాదు తో పాటు ఫోటోలను కూడా అప్లోడ్ చేయవచ్చునని తెలిపారు.

నీరు ఇలా ఉంటే రోగాలు రావా?

కుళాయి నీటిలో పురుగులు
వాటర్ ట్యాంక్ చుట్టూ మురుగు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మీరు చూస్తున్న ఫోటోలో నీరు ఏదో బురద గుంత నీరు అనుకుంటే పొరపాటే. నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న కుళాయి నీరు. అయితే ఆ నీటిలో పురుగులు ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. మంగళవారం ఉదయం స్థానిక విటి అగ్రహారం 35వ డివిజన్ గణేష్ నగర్ ప్రాంతంలో కుళాయి ద్వారా విడిచిపెట్టిన నీటిలో విపరీతంగా పురుగులు ఉండడంతో ప్రజలంతా నివ్వెరపోయారు. కొద్దిరోజులుగా బురద నీరు రావడంతో సర్దుకుపోయిన ప్రజలు మంగళవారం వచ్చిన నీటిని చూసి షాక్ అయ్యారు. నీటిలో పురుగులతో పాటుగా పెట్రోల్ వాసన రావడంతో ఇదేమి నీరంటూ పట్టుకోవడం మానేశారు. ఆ నీరు తాగితే డయేరియా తప్పదని ఆందోళనకు గురయ్యారు. ఆ నీటితో స్నానం చేద్దామన్నా ఎక్కడ చర్మ వ్యాధులు వస్తాయోనని భయపడ్డారు. ఈ విషయమై స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంక్ సప్లయ్ మెన్, ఫిట్టర్ ను ప్రజాశక్తి విలేకరి కలిసి అడుగుగా ఎందుకు అలా జరిగిందో అర్థం కావట్లేదని అన్నారు.



కుళాయి నీటిలో వచ్చిన పురుగులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

మరింత బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మంగళవారం ఇటీవల నియమించిన పట్టణ, మండల కమిటీలు నియోజకవర్గ, పట్టణ/మండల స్థాయి అనుబంధ కమిటీల పార్టీ ప్రతినిధులతో పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీ కమిటీలలో నియమితులైన వారికి అభినందనలు తెలుపుతూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వివరించి, అవి ప్రజలకు అందుతున్నాయా లేదా ఒకవేళ అందకపోతే ఎందుకు అందట్లేదో తెలుసుకొని ప్రజలకు అందే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరే విధంగా చూడాలన్నారు. తద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు గంటా రవి, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, మండల పార్టీ కార్యదర్శి పాశి అప్పలనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

యువత నైపుణ్యాభివృద్ధి దిశగా అడుగులు

ప్రజాశక్తి- డెంకాడ

యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచే దిశగా అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ స్కిల్‌ డవలప్‌ మెంట్‌ ప్రోగ్రామ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలన్నారు. ఈ నెల 6 నుంచి 26 వరకు జరుగుతున్న ఈ శిక్షణ ద్వారా గ్రామీణ యువత మహిళా వ్యాపారవేత్తలకు కొత్త అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన నాయకులు లోకం ప్రసాద్‌, డెంకాడ ఎంపిపి వాసుదేవరావు, ఎంపిడిఒ భవాని, నాయకులు దాడిశెట్టి శ్రీనివాస్‌, పైల శంకరరావు, పాలు శ్రీను, బాసి దుర్గా, పల్లంట్ల జగదీష్‌, పళ్ల రాంబాబు, గుడివాడ జమ్మురాజు, పతివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు

ప్రభుత్వ రంగంలోనే నడపాలి

విజయనగరం టౌన్‌ : ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలను ప్రభుత్వ ఆధ్వర్యాన్నే నడపాలని పలువురు పేర్కొన్నారు. జై భీమ్‌రావు భారత్‌ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్‌ కళాశాలను ప్రైవేట్‌ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మేధో మధన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ను ప్రైవేట్‌ పరం చేయడం వలన వైద్య విద్య పేద బడుగు బలహీన వర్గాలకు అందని ద్రాక్షలా మారుతుందని అన్నారు. 590 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జై భీమ్‌ రావ్‌ భారత్‌ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌, పార్టీ వర్కింగ్‌ కమిటీ ప్రెసిడెంట్‌ జగ్గారపు మల్లికార్జున్‌, జై భీమ్‌ రావు భారత్‌ పార్టీ జిల్లా అధ్యక్షులు తుంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, చింతపల్లి దుర్గారావు వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఐడి కార్డుల వితరణ

మెరకముడిదాం: మండలంలోని గోపన్నవలస ప్రాథమిక పాఠశాలలో కెల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు సారికి అప్పారావు ఐడి కార్డులను వితరణగా అందించారు. విద్యార్థులకు గుర్తింపు కార్డులను బహూకరించి ఉదారత చాటుకున్న అప్పారావుని ప్రధానోపాధ్యాయుడు కనకం శ్రీను, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయలు, గ్రామస్తులు ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయుడు రౌతు చిన్నప్పల నాయుడు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నైట్‌ హాల్ట్‌ బస్సు నడపాలని వినతి

వేపాడ: విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ నుంచి ఎన్‌ఏడి, గోపాలపట్నం, పెందుర్తి, కొత్తవలస, ఎల్‌ కోట, సోంపురం జంక్షన్‌, సింగరాయ జంక్షన్‌ మీదుగా వేపాడ మండల కేంద్రానికి నైట్‌ హాల్ట్‌ బస్సు సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌టిసి ఉత్తరాంధ్ర రీజనల్‌ చైర్మన్‌ డి. దొరకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మండలం నుంచి విశాఖపట్నం వెళ్లే రోజువారి కూలీలకు, అత్యవసర వైద్య సేవలు కేజీహెచ్‌కు వెళ్లే వారికి, ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సౌకర్యంగా ఉండే విధంగా వేపాడలో నైట్‌ హాల్ట్‌ బస్సు ఏర్పాటు చేయాలన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు అప్పారావు తెలిపారు.

'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' కరపత్రం విడుదల

నెల్లిమర్ల: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు కరపత్రం ఎమ్మెల్సీ డాక్టర్‌ పి.సురేష్‌ బాబు మంగళవారం విశాఖపట్నంలో విడుదల చేశారు. 1966 విశాఖ ఉక్కు ఆంధ్రులకు హక్కు ఉద్యమ స్ఫూర్తి ప్రదాత దళిత సామాజిక వర్గానికి చెందిన తాడికొండ మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు జయంతిని పురస్కరించుకొని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని, టిడిపి కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని, అంబేద్కర్‌ రైట్స్‌ ఫోరమ్‌, ఆంధ్రప్రదేశ్‌ శాఖ రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్‌ రైట్స్‌ ఫోరమ్‌ రాష్ట్ర అధ్యక్షులు భానుమూర్తి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ రాజు, జామి మండల ప్రతినిధి రవికుమార్‌, ఎస్‌సి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

శృంగవరపుకోట: పెందుర్తి నుంచి బొడ్డవర వరకూ నిర్మించనున్న 516 -బి జాతీయ రహదారిలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో వాటిని మంగళవారం తహశీల్దార్‌ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎస్‌.కోట, కొత్తూరు, కాపు సోంపురం, టిబి వర తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు చెరువులు, కాలువలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.10వేలు వితరణ

చీపురుపల్లి: చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం నిర్వహిస్తున్న అమృత హస్తం అన్నదాన పథకానికి మంగళవారం మాజీ విప్‌ గద్దె బాబురావు మనవడు వేలూరి అమోగ్‌ చౌదరి రూ.10వేలు విరాళాన్ని సంస్థ ప్రతినిధులకు అందజేశారు. కాగా ఇటీవల ఆమోగ్‌ చౌదరి తెలంగాణ కేడర్‌లో గ్రూప్‌ 1 ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర సివిల్‌ సప్లై డైరెక్టర్‌ గద్దె బాబురావు, ఆయన సతీమణి వెంకట నరసమ్మ, కనకమహాలక్ష్మి అమ్మవారు చైర్మన్‌ గవిడి నాగరాజు, గుడివాడ రామ్మూర్తి నాయుడు, మీసాల కృష్ణమూర్తి, తంగుడు రామకృష్ణ, మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్‌ క్లియరెన్స్‌ చేసిన ఆటో డ్రైవర్లు

గజపతినగరం : మండలంలోని ఎం.వెంకటాపురం నుంచి సీతారాంపురం గ్రామానికి వెళ్లే రహదారి ఇరువైపులా ఉన్న జంగల్‌ క్లియరెన్స్‌కు ఆటో డ్రైవర్లు ముందుకొచ్చారు. ఆటో యూనియన్‌ తమ సొంత నిధులతో మంగళవారం జెసిబి పెట్టి సుమారు 8 కిలోమీటర్లు రోడ్డుకి ఇరువైపులా ఉన్న జంగిల్‌ క్లియరెన్స్‌ పనులు చేపట్టారు. కాలం రాజుపేట సర్పంచ్‌ గేదెల ఈశ్వరరావు ఈ పనులను ప్రారంభించారు. జంగిల్‌ క్లియరెన్స్‌ పనులను గజపతినగరం ఎస్‌ఐ కిరణ్‌ కుమార్‌ నాయుడు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కాలం రాజుపేట పెద్దలు లెంక స్వామి, పోలీస్‌ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ, సర్పంచ్‌

కార్యకర్తలంతా కలిసి పని చేయాలి

దత్తిరాజేరు: అపోహాలు, అనుమానాలు పెట్టుకోకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలందరూ కలిసి సమన్వయంతో పనిచేసి విజయాన్ని అందించాలని టిడిపి సీనియర్‌ నాయకులు కొండపల్లి కొండలరావు కోరారు. టిడిపి మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్‌ అధ్యక్షతన కోమటిపల్లి కళ్యాణ మండపంలో మంగళవారం టిడిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలరావు, నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కర్రోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికల్లో అన్ని పంచాయతీలు సర్పంచులు, ఎంపిటిసిలు గెలిచి మంత్రికి గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఒ మృతి

పూసపాటిరేగ : మండలంలోని చౌడువాడ విఆర్‌ఒగా పనిచేస్తున్న రాజు(50) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు స్థానిక తహశీల్దార్‌ కార్యాలయంలో తన విధులు ముగించుకొని విజయనగరంలోని తన ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు.మండలంలోని కుమిలి వచ్చేసరికి రహదారి పై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనక నుండి బలంగా ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్‌ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం తరలించారు. విఆర్‌ఒ మృతి చెందాడని తెలియడంతో రెవెన్యూ ఉద్యోగులంతా విషాదంలో మునిగారు. తహశీల్దార్‌ ఎన్‌వి రమణతో పాటు రెవెన్యూ ఉద్యోగులు మృతదేహాన్ని చూసి చలించిపోయారు. అంతవరకు తమతో కలిసి ఉన్న సహ ఉద్యోగి మృతి చెందడంతో తోటి విఆర్‌ఒలు కన్నీటి పర్యంతమయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

లక్కవరపుకోట మండలంలోని చందులూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఎంపికైన వై.చరణ్‌ కుమార్‌, ఎ.కార్తీక్‌, సిహెచ్‌. ఎర్నాయుడును మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఉప ప్రధానోపాధ్యాయులు చిన్నం నాయుడు స్టాఫ్‌ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా పాఠశాల గ్రామ, మండలానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. ఈ క్రీడాకారులు ఈనెల 8వ తేదీన విజయనగరం విజ్జీ స్టేడియంలో జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్‌ కార్యదర్శి కృష్ణ, సహ కార్యదర్శులు రాజేష్‌, రవిల సమక్షంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌ పోటీలలో ఎంపికయ్యారని ఈ నెల 22,23 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలలో పాల్గొంటారని శ్రీరాములు తెలిపారు.

వాలీబాల్‌ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

బొబ్బిలి: స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం వాలీబాల్‌ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. డివిజన్‌ స్థాయిలో అండర్‌ -14, 17 విభాగంలో బాల, బాలికలకు పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. 7 మండలాల నుంచి క్రీడాకారులు పోటీల్లో తలబడ్డారు. డివిజన్‌ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు బుధవారం భోగాపురంలో జరగనున్న జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని పీడీ ఎన్‌.వి.నాయుడు చెప్పారు. డివిజన్‌ నుంచి 40మంది వ్యాయామ ఉపాధ్యాయులు వంద విద్యార్థులను తీసుకుని వచ్చారు.

వాలీబాల్‌ విజేతలు వీరే..

గంట్యాడ: ఎస్‌జిఎఫ్‌ అండర్‌ 17 బాలురు వాలీబాల్‌ విజేతలుగా మండల జట్టు ఎంపికైందని మండల స్పోర్ట్స్‌ కోఆర్డినేటర్‌ పివిఎస్‌ఎన్‌ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం మండలంలోని మంగళవారం



బొబ్బిలి : వాలీ బాల్‌ పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

విజయనగరం డివిజన్‌ ఎస్‌జిఎఫ్‌ అండర్‌ 17 బాలురు వాలీబాల్‌ పోటీలు జిల్లా వాలీబాల్‌ అసోసియేషన్‌ సెక్రటరీ కెవిఎన్‌ రాజు, భోగాపురం మండల కోఆర్డినేటర్‌ ఎస్‌ నాగన్న ఆధ్వర్యంలో జరిగాయన్నారు. వాలీబాల్‌ పోటీల్లో గంట్యాడ బాలుర జట్టు విజేతలుగా ఎంపికైందన్నారు. బి.గౌతమ్‌, ఎస్‌. జీవ, వి.హేమంత్‌, పి.బుజ్జిబాబు, కె.చంటి, కె.జయసు, వి.చంద్రశేఖర్‌, లీలా శ్యామ్‌, మనోహర్‌ విజేతలుగా నిలిచారని చెప్పారు. వీరిని విజయనగరం డివిజన్‌ స్పోర్ట్స్‌ కోఆర్డినేటర్‌ గర్బాపు తవిటయ్య అభినందించారు.



ఎస్‌కోట: గెలిపొందిన క్రీడాకారులతో కోచ్‌లు, తదితరులు

24న అండర్‌ 19 వాలీబాల్‌ జట్టు ఎంపికలు

విజయనగరం టౌన్‌ : అండర్‌ 19 స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 24 న జిల్లా వాలీబాల్‌ జట్టు ఎంపికలు స్థానిక రాజీవ్‌ క్రీడా మైదానంలో జరుగనున్నట్లు కార్యదర్శి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు పుట్టిన తేదీ సర్టిఫికెట్‌, స్టడీ,ఆధార్‌ కార్డు పట్టుకొని హాజరు కావాలని తెలిపారు.

త్రైక్వాండో క్రీడాకారులకు డిజి అభినందన

విజయనగరం టౌన్‌ : బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన అండర్‌ 14 త్రైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు ఒక బంగారు,నాలుగు రజత పతకాలను, నాలుగు కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం డిఇఒ మాణిక్యం నాయుడును కలిశారు. వీరిని డిఇఒ అభినందించారు. కార్యక్రమంలో స్కూల్‌ గేమ్స్‌ కార్యదర్శులు గోపాల్‌ విజయలక్ష్మి క్రీడాకారులు,వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రైక్వాండో పోటీలకు ఎంపిక

రాజాం: రాష్ట్ర స్థాయి త్రైక్వాండో పోటీలకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు జూనియర్‌, క్యాడెట్‌ విభాగాల్లో ఎంపికయ్యారని సన్‌ స్కూల్‌ కరస్పాండెంట్‌ అమృతరావు, ప్రిన్సిపల్‌ భారతి తెలిపారు. ఈ నెల 19న విజయనగరం విజ్జీ స్టేడియంలో జిల్లా త్రైక్వాండో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారని అందులో తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి పి.మనోజ్‌ బంగారు పతకం, 5వ తరగతికి చెందిన వి.మోహిత్‌ వెండి పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిద్దరూ ఈ నెల 24, 25 తేదీలలో విజయనగరం రాజీవ్‌ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



విజయనగరం: హాకీకి ఎంపికైన జట్టుతో స్కూల్‌ గేమ్స్‌ కార్యదర్శులు

హాకీ జట్టు ఎంపిక పూర్తి

విజయనగరం టౌన్‌ : స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్‌ స్టేడియంలో అండర్‌ 14, 17 హాకీ జట్ల ఎంపికలు జరిగాయి. ఎంపికైన వారు చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జరగబోయే రాష్ట్ర స్కూల్‌ గేమ్స్‌ పోటీల్లో పాల్గొంటారని స్కూల్‌ గేమ్స్‌ కార్యదర్శులు గోపాల్‌, విజయలక్ష్మి తెలిపారు.

ఉద్యోగుల పట్ల వివక్ష విడనాడాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్షతను విడనాడాలని ఫ్యాప్టో నాయకుల బృందం నిరసన వ్యక్తం చేశారు. మండల రిసోర్సు కార్యాలయం వద్ద మంగళవారం ఆ సంఘం రాష్ట్ర నాయకులు జెసి రాజు మాట్లాడుతూ ఇప్పటికే 4 కరువు భత్యాలు పెండింగ్‌లో ఉంచి ప్రస్తుతం ప్రకటించిన డిఎ బకాయి చెల్లింపులలో కూడా తీవ్రమైన జాప్యం ప్రదర్శించడం సహేతుకం కాదన్నారు. డిఎ జీవోలను సవరించాలని కోరారు. సిపిఎస్‌ ఉద్యోగుల బకాయిలు చెల్లింపులు జీవోలు లేకపోవడం, పింఛనుదారులకు 2027-28 సంవత్సరంలో 12 వాయిదాల్లో డిఎ బకాయిలు చెల్లిస్తామని పేర్కొనడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్‌ మండల అధ్యక్షుడు బొప్పే రవికుమార్‌, యుటిఎఫ్‌ జిల్లా సహాయ అధ్యక్షులు ప్రసన్నకుమార్‌, వి.అప్పారావు, కర్రి శ్రీనివాసరావు, రెడ్డి వేణు, వెంకటరావు, రామారావు, శాంతికుమారి, కృష్ణంనాయుడు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

తక్షణమే డిఎ ఉత్తర్వులను సవరించాలి

బొబ్బిలి: డిఎ చెల్లింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జనవరి ఒకటి 2024 నుంచి సెప్టెంబరు 30, 2025 వరకూ చెల్లించాల్సిన డిఎ బకాయిలను పదవీ విరమణ అనంతరం ఇస్తామని లేదా చనిపోయిన ఉద్యోగికి అయితే వారసులకు ఇస్తామని జిఒలో పేర్కొనడం దారుణమని ఎపిటిఎఫ్‌ రాష్ట్ర అకడమిక్‌ కన్వీనర్‌ జెసి రాజు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఎపిటిఎఫ్‌ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కచ్చితంగా ఉద్యోగుల పట్ల వివక్షత చూపటమేనని, తక్షణమే జిఒ 60,61లను సవరించాలని, ఉత్తర్వుల్లో ఉన్న 11,12 పేరాలను తొలగించాలని ఆయన డిమాండ్‌ చేశారు. డిఎ బకాయిలు చెల్లింపులో జారీ చేసిన ఉత్తర్వులు తీవ్ర గందరగోళంగా, ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసేవిగా ఉన్నాయన్నారు. నాలుగు డిఎలు ఇవ్వవలసి ఉన్నా ఒక డిఎతో సరిపెట్టిన ప్రభుత్వం చర్యల్లో ఒక విధంగా జిఒలో మరొక విధంగా అధికారులు పొందుపరచటం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఉపాధ్యాయులను మోసం చేయటమేనని అన్నారు. తక్షణమే జిఒలు సవరించి ఉద్యోగులకు చెల్లించాల్సిన 21 నెలల డిఎ బకాయిలు వారి పిఎఫ్‌ ఖాతాకు జమ చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో జిసిహెచ్‌జి శర్మ, చిన్నారావు, యుగంధర్‌ పాల్గొన్నారు.

టిపిఆర్‌ఒకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్‌

ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలే ఏ ఉద్యోగి కైనా గుర్తింపునిస్తాయని కమిషనర్‌ పల్లి నల్లనయ్య అన్నారు. టిపిఆర్‌ఒగా ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన సింహాచలం గ్రేడ్‌ వన్‌ అధికారిగా ఉద్యోగోన్నతి పొంది గుంటూరు నగరపాలక సంస్థ ప్రాజెక్టు అధికారిగా బదిలీ అయ్యారు. దీంతో విజయనగరం మున్సిపల్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సత్కరించారు. కమిషనర్‌ మాట్లాడుతూ టిపిఆర్‌ఒగా ప్రభుత్వ పథకాల అమలులో సింహాచలం చూపిన చొరవ ఆదర్శప్రాయం అన్నారు. సింహాచలం మాట్లాడుతూ అందరి సమన్వయంతోనే ఇక్కడ సేవలను అందించగలిగానని అన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్‌ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు, అసోసియేషన్‌ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండలంలోని నడిపల్లి గ్రామంలో సర్వే నెం 73, 92, 93, 94లలో అనధికారకంగా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్ల్‌ పైన శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశామని ఎంపిడిఒ ఐ.సురేష్‌ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఇటీవల అక్రమ లేఅవుట్‌ పైన పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి చర్యలకు సిఫార్సు చేసామన్నారు. సదరు అనాధికృత యజమానిని సంప్రందించేందుకు ప్రయత్నంచిగా వారు విశాఖపట్నంలో వున్నట్లు గుర్తించామన్నారు. పంచాయతీ రెవెన్యూ పరంగా ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన సదురు లేఅవుట్‌లో ఎటువంటి కొనుగోలు అమ్మకాలు జరపకూడదని ఆయన వివరించారు. ఈ మేరకు లేఅవుట్‌కి నాలుగు పక్కల హెచ్చరిక బోర్డులను మంగళవారం ఏర్పాటు చేశారు. అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఎవరైనా స్థలాలు కొనుగోలు జరిపితే వారికి ఎటువంటి అనుమతులూ లభించవని ప్లాన్‌ అనుమతులు కూడా మంజూరు కావని, విద్యుత్‌ సౌకర్యం కూడా ఉండదని హెచ్చరించారు. సదరు అనధికార లేఅవుట్‌ వద్ద రాసిన లేఅవుట్‌ వివరాల్లో సంప్రదించవలసిన ఇ మెయిల్‌ అడ్రస్‌ నకు నోటీసులు జారీ చేశామన్నారు. సదరు యజమానికి లేఅవుట్‌ అభివృద్ధిని వెంటనే నిలుపుదల చేయాలని, లేనిచో ఎమ్‌ఆర్‌డిఎ చట్టంలో నిబంధనలు ప్రాప్తికి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అప్పలనాయుడు, స్థానిక పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి - భోగాపురం

పేద, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎపి మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌, నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళవారం పోలిపల్లి గ్రామంలో గల తన నివాసం వద్ద నియోజకవర్గానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులు రూ. 3.35లక్షలు పంపిణీ చేశారు. పూసపాటిరేగ మండలం, ఎల్‌పి పాలెం గ్రామానికి చెందిన రౌతు సోమేశ్వరరావుకు రూ.1.69 లక్షలు, గుంపాం గ్రామానికి చెందిన పతివాడ పైడినాయుడుకు రూ.66,900లు, భోగాపురం మండలం, నందిగాం గ్రామానికి చెందిన దుర్గాసి రమణకు రూ. 40వేలు, డెంకాడ మండలం, అమకాం గ్రామానికి చెందిన ఉప్పల సునీతకు రూ. 59వేలు సహాయ నిధిని ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్‌ గరి వెంకటరమణ, గుంపాం మాజీ సర్పంచ్‌ కొత్తకోట వెంకటరమణ, నాయకులు శ్రీను, మొయిద సీతంనాయుడు, దిండి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం: చెక్కులను అందిస్తున్న కర్రోతు

బొబ్బిలి: పేదలకు వరంగా సిఎం సహాయనిధి పని చేస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో మంగళవారం సిఎం సహాయనిధి చెక్కులను పంపిణి చేశారు. నియోజకవర్గానికి చెందిన బి.దేవకికు రూ.4లక్షలు, సిహెచ్‌.సత్యప్రసాద్‌కు రూ.1.50 లక్షలు, బి.పోలయ్యకు రూ.2లక్షలు, సిహెచ్‌.సతీష్‌ కుమార్‌కు రూ.3లక్షలు, సుంకర సాత్వికకి రూ.లక్ష మంజూరు కావడంతో చెక్కులను ఆయా కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ ఉన్నత పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగుపూడి గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనంను స్వయంగా పరిశీలించి రోజూ విద్యార్థులకు అమలు చేస్తున్న భోజన మెనూ గురించి వార్డెన్‌ బి.సురేష్‌ని ఆరా తీశారు. హాస్టల్‌ పరిసర ప్రాంతాలు, సౌకర్యాల గురించి స్వయంగా విద్యార్థులతో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, కావాల్సిన ఇతర మౌళిక సదుపాయాల గురించి స్వయంగా తరగతి గదులకి వెళ్లి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను ధ్రువీకరించి, ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు కల్పించే వసతి సౌకర్యాలను స్వయంగా పరిశీలించి వాటి గురించి చర్చించారు. విద్యార్థులకు ఏమైనా మౌలిక సదుపాయాలు అవసరముంటే తన దృష్టికి తేవాలని సూచించారు. పాఠశాలలో 168 మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్‌ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్‌ చైర్మన్‌ పొట్నూరు వెంకటరత్నాజీ, పిఎసిఎస్‌ చైర్మన్‌ కోళ్ల శ్రీను, మాజీ సర్పంచ్‌ చల్లా వెంకటరావు, గొంప దుర్గా ఉమేష్‌ తదితరులు పాల్గొన్నారు.



వంటగదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొర్లె



ప్రజాశక్తి - శృంగవరపుకోట

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొర్లె రవికుమార్‌ను ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌ రెడ్డి నియమించారు. జామి మండలంలోని జట్టేటివలసకు చెందిన గొర్లె రవికుమార్‌ గత 15 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో ప్రతేక పాత్ర పోసిస్తున్నారు. కాంగ్రెస్‌, వైసిపి పార్టీల్లో పలు కీలక పదవులు చేపట్టిన రవికుమార్‌ మండల వైసిపి కన్వీనర్‌గా ఉన్నారు. సతీమణి గొర్లె సరయు గతంలో ఎంపిపిగా పని చేసి, ప్రస్తుతం జెడ్‌పిటిసిగా సేవలందిస్తున్నారు. మండల రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న రవికుమార్‌ను గుర్తించిన జిల్లా వైసిపి పెద్దలు ఎట్టకేలకు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని అప్పగించారు. దీంతో మండలంలోని నాయకులు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- తెర్లాం

పంచాయతీల పరిధిలో 15 మందితో కూడిన గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల కమిటీ, సోషల్‌ మీడియా సభ్యులు, ఆయా అనుబంధ శాఖ అధ్యక్షులతో కలిసి పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ విద్యను సామాన్య మధ్యతరగతికి దూరం చేస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. అందులో భాగంగా ప్రతి గ్రామం నుంచి 500 మందికి తగ్గకుండా సంతకాలు సేకరణ చేయాలని సూచించారు. అనంతరం కోటి సంతకాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు తెంటు సత్యం నాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, పాల్గొన్నారు.

గ్రీన్‌ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో పనిచేస్తున్న గ్రీన్‌ అంబాసిడర్లు, పంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ అధ్యక్షతన మంగళవారం ఎంపిడిఒ స్వరూపారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, గ్రామాల పరిశుభ్రతలో, ప్రజల ఆరోగ్య రక్షణలో గ్రీన్‌ అంబాసిడర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ప్రభుత్వం వారి సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్‌, ఈఎస్‌ఐ వంటి చట్టపరమైన హామీలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వృత్తిపరమైన ఆరోగ్య భృతి రూ.4వేలు ఇప్పటికీ అందకపోవడం అన్యాయమన్నారు. మూడు నెలలుగా బకాయిలుగా ఉన్న జీతాలను కూడా తక్షణం విడుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్త్రీ పురుషులకు సమాన వేతనం అమలు చేయాలని, భోగాపురంలో పనిచేస్తున్న కార్మికులు బ్యాంక్‌ అకౌంట్‌ లు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ధనాల నర్సింగరావు, జి. అప్పారావు, ఎస్‌.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వండి

డ్వామా పీడీ శారదాదేవి

ప్రజాశక్తి-కంటోన్మెంట్‌

నీటి సంరక్షణ, నిల్వ చేసే పనులకు ప్రణాళికలో ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలని డ్వామా ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ ఎస్‌.శారద దేవి కోరారు. ఉపాధి హామీ పనులపై స్థానిక డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో మంగళవారం వర్క్‌ షాప్‌ నిర్వహించారు. 2026- 27 పనుల ప్రణాళిక, బడ్జెట్‌ కేటాయింపు, గుర్తింపు, పనుల నిర్వహణ తదితర అంశాలపై శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి తాజాగా ప్రభుత్వం జారీ చేసిన అంశాలను వివరించారు. సమావేశంలో ఎపిడిలు, ఎపిఒలు, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

నెల్లిమర్ల : నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని టౌన్‌ డిఇఇ పి.త్రినాధరావు తెలిపారు. 11కెవి ఆర్‌డిఎస్‌ఎస్‌, ఎబిఎల్‌ సర్గేషన్‌ పనులు, చెట్టుకొమ్మలు తొలగింపులో భాగంగా నెల్లిమర్ల సబ్‌ స్టేషన్‌ పరిధి, సారిపల్లి రూరల్‌ ఫీడర్‌ పరిధిలో సారిపల్లితో బాటు, వ్యవసాయ కనెక్షన్‌లకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మహాసభను జయప్రదం చేయండి

బొబ్బిలిరూరల్‌ :డిసెంబర్‌ 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు కోరారు. కోమటిపల్లి, కలవరాయి, చింతాడ, పక్కి, పిరిడి తదితర గ్రామాల్లో మహాసభలపై ప్రచారం నిర్వహించారు. గోపాల్‌, నిర్మల, లక్ష్మి, మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

బొబ్బిలి: బొబ్బిలి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో గుర్తు తెలియని మహిళా స్పృహతప్పి పడిపోయింది. రక్తపు మడుగుల్లో ఉన్న ఆ మహిళను ఎవరూ పట్టించుకోలేదు. గొల్లపల్లి వైపు వెళ్తున్న ఎస్‌ఐ రమేష్‌, సిబ్బంది మహిళను చూసి సపర్యలు చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు చెప్పారు. పోలీసులు సేవను ప్రజలు కొనియాడుతున్నారు. మృతిరాలి వివరాలు తెలియాల్సి ఉంది.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురంలో వైకుంఠపు సత్యవతి పెంకుటిల్లు ఆదివారం కురిసిన వర్షానికి గోడలు పూర్తిగా నానిపోవడంతో సోమవారం కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాన్ని విఆర్‌ఒ పరిశీలించి జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని బాధితరాలకు హామీ ఇచ్చారు.

ప్లాంక్స్‌ వితరణ

వేపాడ: మండలంలోని డిఆర్‌పేట మండల పరిషత్‌ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గుమ్మడి నరసింహమూర్తి కుమారుడు నవీన్‌ కుమార్‌ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రూ.3వేలు విలువ చేసే ప్లాంక్స్‌, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు నవీన్‌ కుమార్‌ను అభినందించి సత్కరించారు.